క్లుప్తంగా

30 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ ఉచిత శిక్షణ

కాచిగూడ: టెక్ మహీంద్ర ఫౌండేషన్ స్మార్ట్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి కాచిగూడలోని సీసీ షరాఫ్ ఆసుపత్రి ఎదురుగా గల ఫౌండేషన్ సెంటర్‌లో స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, బేసిక్ ఐటీ స్కిల్స్, తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు స్మార్ట్ సెంటర్ మేనేజర్ కిరణ్ తేజ తెలిపారు. వివరాలకు 7993322683, 7989995685 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

రేపు గద్దర్ సంస్మరణ సభ

కాచిగూడ: ప్రజా యుద్ధనౌక, ప్రజా వాగ్గేయ కారుడు గద్దరన్న సంస్మరణ సభను ఈ నెల 23న సాయంత్రం 5:30 గంటలకు నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ కమిటీ ప్రతినిధులు కెఎస్ రాందాస్, కెకె రాజా, గనుమల జ్ఞానేశ్వర్ తెలిపారు. కార్యక్రమానికి గద్దర్ కుమారుడు సూర్యకిరణ్, కుమార్తె వెన్నెల, గోరటి వెంకన్న, విమలక్క, కె.జయరాజ్ తెలిపారు.

సెప్టెంబర్ 9న బిజినెస్ మీట్

కాచిగూడ: ఎంఎంఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న జూబ్లీహిల్స్ లోని జెఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో బిజినెస్ మీట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు మడిపడిగె రాజు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 800లకు పైగా ప్రముఖ వ్యాపార వేత్తలు ఈ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ మీట్‌లో పాల్గొనే ఆసక్తిగల వ్యాపారవేత్తలు ముందుగా తమ పేర్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 9391841653, 9965624111 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

కాంగ్రెస్‌లో బీసీలకు 60 అసెంబ్లీ సీట్లు కేటాయించాలి



అంజన్‌కుమార్ యాదవ్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 60 సీట్లు ఇవ్వాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సోమవారం టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించే విధంగా పార్టీ అధిష్టాన వర్గాన్ని ఒప్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నందగోపాల్, వేముల రామకృష్ణ, బీసీ వెంకట్, సతీష్, రాందేవ్ మోడీ తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రి రాజీనామా చేయాలి

కాచిగూడ: గిరిజన మహిళపై దాడికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర హోంమంత్రి రాజీనామా చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో గిరిజన మహిళ లక్ష్మీ పై పోలీసులు దాడిచేసి అక్రమంగా అరెస్ట్ చేసి చిత్రహింసలకు గురిచేశారని ఆయన పేర్కొన్నారు. బాధిత మహిళకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్, రాష్ట్ర డీజీపీ స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి

చిక్కడపల్లి: తెలంగాణలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌రావాలని అందుకోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు అకుంఠితదీక్షలో పనిచేయాలని అసోం శాసనసభ్యులు డాక్టర్ పరమానంద రాజ్‌బోంగ్షి అన్నారు. సోమవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాలలో జరిగిన సమావేశంలో ప్రసంగించారు. ఆయనతోపాటు సహప్రముఖ్ రిపుంజాయ్ సెయికై హాజరయ్యారు. నియోజవర్గంలో ఏడు రోజులపాటు వారు విస్తృతంగా పర్యటించి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

మద్యం తాగి న్యూసెన్స్ చేసిన ఆరుగురికి జైలు

కాచిగూడ: మద్యం తాగి బస్తీల్లో న్యూసెన్స్ సృష్టించిన ఆరుగురికి కోర్టు జైలు శిక్ష విధించిందని కాచిగూడ సీఐ రామ లక్ష్మణ రాజు తెలిపారు. కాచిగూడ నింబోలిఅడ్డకు చెందిన బాలాజీ రఘునాథ్ కుంబార్ (43) మద్యం తాగి బస్తీలో న్యూసెన్స్ చేసేవాడు. అతనికి 8వ స్పెషల్ ఎంఎంకోర్టు, 5 రోజుల జైలు శిక్ష విధించింది. కృష్ణానగర్ కు చెందిన దాసరి శివ ప్రసాద్ (21), కంది దినేష్ (22), నూనెముంతల సాయికిరణ్ (22), పిడిశెట్టి ప్రవీణ్ (21), తిలక్‌నగర్‌కు చెందిన ఠాకూర్ వైభవ్ సింగ్ (22)లకు కోర్టు ఒక్క రోజు జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.800 జరిమాన విధించిదని ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు తెలిపారు.

కేడర్..హుషార్

అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే బీఆర్ఎస్ టికెట్లు కేటాయించడంతో పార్టీ కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకుంటున్నారు. అంబర్‌పేట టికెట్ కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ టికెట్ ముఠా గోపాల్ పేర్లు కేసీఆర్ ప్రకటించిన జాబితాలో ఉండటంతో రెండు నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా సోమవారం మధ్యాహ్నం ప్రకటిస్తారని మీడియాలో రావడంతో ఉదయం నుంచే ఆయా ఎమ్మెల్యేల కుటుంబసభ్యులు, అభిమానులు టీవీలకు అతుక్కుపోయారు. మా ఎమ్మెల్యేకు టికెట్ వస్తుందో..రాదో అన్న ఆందోళన కూడా కొందరిలో నెలకొంది. అయితే జాబితాలో ఈ ఇద్దరి పేర్లు కనిపించడంతో సంబరాలు చేశారు.



గోల్నాక క్యాంప్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సంబరాలు



అంబర్‌పేట మహాంకాళి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. పార్టీ అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు టికెట్ ప్రకటించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా కాలుస్తూ మిఠాయిలు పంచుకున్నారు. కాలేరు వెంకటేశ్‌కు పార్టీ అసెంబ్లీ టికెట్ ఖరారు కాగానే ఆయన నేరుగా నియోజకవర్గానికి వచ్చారు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా అంబర్‌పేట మహంకాళి ఆలయానికి వెళ్లారు. అక్కడ ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. పటేల్‌నగర్‌కు ర్యాలీగా కార్యకర్తలతో వెళ్లి అక్కడ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. గోల్నాకలోని పార్టీ కార్యాలయం వద్ద సైతం పార్టీ శ్రేణుల సంబరాలు మిన్నంటాయి.

నల్లకుంట: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన తొలివిడత జాబితాను సోమవారం సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ప్రకటించారు. తొలిజాబితాలో అంబర్‌పేట అభ్యర్థిగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేరు ఉండడంతో నియోజక వర్గం బీఆర్ఎస్ నాయకులు నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను పూలమాలలతో సన్మానించి, టపాకాయలు కాల్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు కేటాయిస్తూ జాబితాను బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ విడుదల చేయడం పట్ల బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సోమవారం కాచిగూడలో పార్టీ నేత జంగాల అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తూ బాణా సంచా కాల్చారు. స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్, శివకుమార్, రాజేష్, ప్రదీఫ్, వెంకటేష్, రాము, వీరేష్, రాజు పాల్గొన్నారు.



నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



కాచిగూడలో స్వీట్స్ పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

గులాబీ శ్రేణుల భారీ ర్యాలీ



తండ్రి ముఠా గోపాల్‌కు మిఠాయి తినిపిస్తున్న కుమారుడు ముఠా జైసింహ

ముషీరాబాద్: బీఆర్ఎస్ టికెట్లను ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం మధ్యాహ్నం ప్రకటిస్తారని వార్తలు వెలువడగానే గాంధీనగర్‌లోని ముఠా గోపాల్ నివాసానికి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అప్పటికే ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు టీవీలకు అతుక్కుపోయి ఉత్కంఠభరితంగా కేసీఆర్ ప్రెస్‌మీట్ కోసం ఎదురు చూడసాగారు. కేసీఆర్ ప్రెస్‌మీట్‌లో ముఠా గోపాల్ పేరు వెలువడడంతో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ముఠా గోపాల్‌కు అభినందనలు తెలియజేశారు. మిఠాయిలు తినిపించారు. ఇంటి ముందు బాణాసంచ కాల్చి డీజే సౌండ్‌తో పాటలకు నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యకర్తల సంబరాలతో ఆ ప్రాంతమంతా గులాబిమయంగా మారింది. మెట్రో కేఫ్ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, రాంనగర్ చౌరస్తా, భోలక్‌పూర్, ముషీరాబాద్ తదితర ప్రాంతాల్లో భారీ ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ తనయుడు ముఠా జైసింహ, సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, వివిధ డివిజనల్ అధ్యక్షులు బి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్.మోజెస్, నర్సింగ్‌ప్రసాద్, రాకేష్, వల్లాల శ్యామ్‌యాదవ్, వల్లాల శ్రీనివాస్, కొండపల్లి మాధవ్, శ్యామ్‌సుందర్, రవియాదవ్, మహ్మద్ ఖదీర్, పరశురామ్, మల్లికార్జున్‌రెడ్డి, ఆకుల అరుణ్, లింగాల శ్రీకాంత్, నాయుడు రవి తదితరులు ముఠా గోపాలకు అభినందనలు తెలిపారు.



ఉత్కంఠగా టీవీ చూస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ తదితరులు



అభినందనలు తెలియజేస్తున్న నాయకులు నాయుడు రవి, పరశురామ్ తదితరులు

గెలిచి కేసీఆర్‌కు గిఫ్ట్ ఇస్తా

- నేను చేసిన అభివృద్ధే టికెట్ దక్కేలా చేసింది
- సాక్షితో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. మళ్లీ ముఠా గోపాల్‌కే టికెట్ లభిస్తుందా... లేక ఆయన కుమారుడు ముఠా జైసింహకు టికెట్ ఇస్తారా..అనేదానిపై జోరుగా ప్రచారం సాగింది. దీనికి తోడు వివిధ పత్రికల్లో ముషీరాబాద్ టికెట్‌ను తొలి విడత జాబితాలో ప్రకటించడం లేదనే ప్రచారం సాగడంతో రాజకీయ విశ్లేషకులు పలువిధాలుగా ఆలోచించారు. ఈ ఆలోచనలన్నిటికి తెరదించుతూ ముఖ్యమంత్రి కేసిఆర్ ముఠా గోపాల్ పేరును ఖరారు చేస్తూ ప్రకటించారు. ఈ నేపథ్యంలో టికెట్ దక్కించుకున్న ముఠాగోపాల్‌తో సాక్షి జరిపిన మాటామంతి..

ప్రశ్న: కేసిఆర్ మీరు టికెట్ ప్రకటించడం పట్ల మీ స్పందన?

జవాబు: నాపై నమ్మకం ఉంచి నాకు టికెట్ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. 2018 ఎన్నికల్లో సాధించిన మెజార్టీ కంటే అత్యధిక మెజార్టీతో విజయం సాధించి కేసిఆర్‌కు నా విజయాన్ని గిఫ్ట్‌గా ఇస్తా.

ప్రశ్న: మీకు ప్రధాన ప్రత్యర్థి ఎవరని భావిస్తున్నారు?

జవాబు: ముషీరాబాద్ నియోజకవర్గంలో ఏ పార్టీతో నాకు పోటీ లేదు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండవ స్థానం కోసం పోటీపడుతున్నాయి. ఎన్నికల ఫలితాల తరువాత ఏ పార్టీ రెండవ స్థానంలో నిలుస్తుందో అదే నాకు ప్రత్యర్థి.

ప్రశ్న: మీ కుమారుడు ముఠా జైసింహకు టికెట్ దక్కుతుందని అందరూ భావించారు కదా?

జవాబు: పార్టీ అధిష్టానం ప్రత్యర్థుల బలాబలాలు, ఈక్వేషన్స్, సర్వేలు వీటన్నిటిని పరిగణలోకి తీసుకోని నిర్ణయం ప్రకటించారు. ఏదిఏమైనా మా కుటుంబానికి టికెట్ దక్కడం చాలా సంతోషం.

ప్రశ్న: మళ్లి టికెట్ దక్కడానికి కారణాలు ఏమిటని భావిస్తున్నారు?

జవాబు: తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నేటి వరకు ప్రజల్లో ఉంటూ గల్లీగల్లీ తిరుగుతూ ప్రజల కష్ట సుఖాల్లో నేను పాలుపంచుకుంటున్నాను. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను నా సమస్యలుగా భావించి వాటి పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేశా. ముఖ్యంగా కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు ఎలాంటి లోటు రాకుండా నిత్యవసర వస్తువుల పంపిణీ, ప్రభుత్వం నుంచి అందించే అన్ని సదుపాయాలను అందేటట్లు చూశా. ఇందిరాపార్కులో స్విమ్మింగ్ పూల్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నాం. బాపూజీనగర్ నాలా, హుస్సేన్‌సాగర్ రిటైనింగ్ వాల్, పార్కులు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళిత బంధు, మైనార్టీ బంధు, బీసీ బంధులను అందరికీ అందేటట్లు చూశాను. దీనికి తోడు బస్తీ దవాఖానాలు, స్టీల్ బ్రిడ్జి నిర్మాణం, అంతర్గత రోడ్ల అభివృద్ధి, ముషీరాబాద్ ప్రభుత్వ నూతన పాఠశాల భవన నిర్మాణం ఇలా ఒక్కటేమిటి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్న తనను చూడడం వల్లనే మళ్లి అవకాశం దక్కిందని భావిస్తున్నా.

కార్మిక సంఘం నాయకుడిగా మొదలైన ప్రస్థానం..

అభ్యర్థి పేరు: ముఠా గోపాల్
తల్లిదండ్రులు: రాజయ్య, రాజేశ్వరి
భార్య: సరోజీని
సంతానం: కుమారుడు, కుమార్తె
పుట్టిన తేదీ: 10-02-1953
జన్మస్థలం: అర్జకొండ, మండలం తప్పదండి, జిల్లా కరీంనగర్
విద్యాభ్యాసం: డిగ్రీ(బిఏ)
వృత్తి: వ్యాపారం

ముషీరాబాద్: 1983లో తొలుత కార్మిక సంఘం నాయకుడిగా పని చేసిన ముఠా గోపాల్ బీహెచ్ఈఎల్, పయనీర్, అగర్వాల్ ఇండస్ట్రీస్, నేతాస్ స్పిన్నింగ్ మిల్ వంటి పరిశ్రమల్లో కార్మిక సంఘం నాయకుడిగా ఎన్నికయ్యారు. 1978లో ఆర్టీసీ కండక్టర్‌గా పని చేసిన తరువాత సినీ డిస్ట్రిబ్యూటర్‌గా కొనసాగారు. 1983లో టీడీపీలో చేరి, 1986లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జవహర్‌నగర్ కార్పొరేటర్‌గా పోటీ చేసి ప్రస్తుత బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌పై గెలుపొందారు. 1995 నుంచి 2002 వరకు మూడుసార్లు టీడీపీ నగర అధ్యక్షులుగా, ఒకసారి హుడా డైరెక్టర్‌గా, కనీస వేతనాల బోర్డు చైర్మన్‌గా పని చేశారు. 1995లో సీఎం కేసీఆర్ రవాణా శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా పని చేశారు. 2014 ఎన్నికల్లో టీడీపీ సీటు దక్కకపోవడంతో టీఆర్ఎస్‌లో చేరి ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి రెండవస్థానంలో నిలిచారు. 2018లో తిరిగి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్‌పై 38వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి బీఆర్ఎస్ తరపున టికెట్ దక్కించుకున్నారు.

గద్దర్ పాట సజీవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజా గాయకుడు గద్దర్ భౌతికంగా లేకపోయినా ఆయన పాట సజీవంగా ఉంటుందని ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో లాల్ నీల్ మైత్రి వేదిక ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్, సియాసత్ ఎడిటర్ జహీరుద్దీన్ ఆలీఖాన్‌ల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ ప్రజా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని అదే తరహాలో ప్రజాస్వామిక విలువల కోసం పత్రిక ద్వారా కృషి చేసిన జహీరుద్దీన్ అలీఖాన్‌లు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడంలో వారు చేసిన కృషి మరువలేనిదన్నారు. సుప్రసిద్ధ కవి జయరాజు మాట్లాడుతూ తన పాటలతో ప్రజల్లో చైతన్యం కలిగించిన గాయకుడు గద్దర్ అని అన్నారు. గద్దర్ ఆశయ సాధన కోసం కృషి చేసినప్పుడే నిజమైన నివాళి అన్నారు. సీనియర్ జర్నలిస్టు బొజ్జ భిక్షమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గాదె ఎన్నయ్య, నల్లా సూర్యప్రకాష్, గాదగోని రవి, జి.రాములు, రేఖచంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ ఖాసీం తదితరులు

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



నాగదేవత దేవాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: చిక్కడపల్లి పీపుల్స్‌పార్క్‌లోని శ్రీ నాగదేవత రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నాగుల పంచమి సందర్భంగా బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ మహిళా విభాగం ఉపాధ్యక్షులు ముచ్చకుర్తి పద్మ, ప్రధానకార్యదర్శి తుడుం లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ లక్ష్మిగణపతి దేవాలయం చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్ ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఆలయ పూజారి శ్రీనివాస్‌తో పాటు మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ చిక్కడపల్లి పీపుల్స్ పార్క్‌లో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు.

14న వనపర్తిలో విద్యార్థి పోరుగర్జన



విద్యార్థి పోరు గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రకటించాలని, 5,500 కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం నాయకులు అరవింద్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14వ తేదీన వనపర్తిలో రాష్ట్రస్థాయి విద్యార్థి పోరు గర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోరు గర్జనకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో విద్యార్థి సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని, సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని, స్కాలర్‌షిప్‌లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, అనంతయ్య, రాజ్‌కుమార్, నర్సింహ్మాగౌడ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధిష్టానం పునరాలోచించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: అంబర్‌పేట బీఆర్ఎస్ టికెట్టు ప్రకటనపై పార్టీ అధిష్టానం పునరాలోచించుకోవాలని ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి పార్టీ అధిష్టానాన్ని కోరారు. 2014 నుంచి తాము పార్టీ కోసం త్యాగాలు చేస్తే తమను అధిష్టానం గుర్తించకపోవడం శోచనీయమన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అంబర్‌పేట పార్టీ టికెట్టు సిట్టింగ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు కేటాయించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఛే నెంబర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్ పులి జగన్, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, ఆయన అనుచరులతో కలిసి ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని బలహీనపరచిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు తిరిగి పార్టీ టికెట్టు ఎలా ఇస్తారని ఆయన అధిష్టానాన్ని ప్రశ్నించారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడ్డారని ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఈ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ఆచార్య కోవెల సంపత్‌కుమారాచార్యకు నివాళి

నాంపల్లి: ఛందస్సు, అలంకారశాస్త్రం, వచనపద్యం మూడు నామాలుగా ఆచార్య సంపత్‌కుమారాచార్యుల ముఖారవిందంపై కళాకాంతులను విరజిమ్మాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. ఛందశ్శాస్త్రాలంకారులు ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య స్మారకోపన్యాసం సోమవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేవీ రమణాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన ప్రసంగించారు. కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు ఆచార్య కాత్యాయని విద్మహే హాజరై సంపత్కుమార సాహిత్య విమర్శ విలువలు అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగువర్సిటీ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు కోవెల సంపత్కుమారాచార్యులు తెలుగు సాహిత్యానికి, ఛందశ్శాస్త్రానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణాచార్యులు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కేవీ రమణాచారి, తంగెడ కిషన్‌రావు

భార్యా బాధితులకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భార్యా బాధితుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని భార్యా బాధితుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జి.బాలాజీరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలాజీరెడ్డి మాట్లాడుతూ గృహ హింస చట్టం తప్పుడు కేసు అని తేలితే కేసు పెట్టిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కేసు పెట్టిన తరువాత కేసు తేలినా, తేలకపోయినా కోర్టు నుంచి విడాకులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో భార్య బాధిత సంఘం నాయకులు మురళీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భార్యా బాధితుల సంఘం అధ్యక్షులు బాలాజీరెడ్డి

శ్రీశ్యామ్‌మందిర్‌లో నాగులపంచమి పూజలు

కాచిగూడ: శ్రావణ సోమవారం, నాగుల పంచమి సందర్భంగా కాచిగూడలోని శ్రీశ్యామ్‌మందిర్‌లో భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో భక్తులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శివ లింగానికి రుద్రాభిషేకం చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు మహా హరతి, తీర్థ ప్రసాదం అందజేశారు.



ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సుల్తాన్‌బజార్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎన్‌హెచ్ఎం (నేషనల్ హెల్త్ మిషన్)లో పనిచేస్తున్న కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులను ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని తెలంగాణ ఎన్‌హెచ్ఎం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కన్వీనర్ లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కోఠిలోని డీఎంహెచ్ఎస్ క్యాంపస్ ఆవరణలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం వైద్యుల మాదిరిగానే మాకు కూడా వెయిటేజీ ఇచ్చి రెగ్యులర్ చేయాలన్నారు. ఈ ధర్నాలో వర్కిగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సామీ, ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్, ట్రెజరర్ తిరుమలరెడ్డి, ఫార్మసిస్ట్ రంజిత్, శంకర్, శ్రీనివాసరావు, వివిధ క్యాడర్లకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డీహెచ్. డాక్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.